# ఫలించని ప్రేమ

శ్రీ ఎస్. ఎమ్. వాడ్రేవ్

స్టేడియం హోటల్లో గోపాలం, రమేశం, పంచాక్షరి, ముగ్గురూ రౌండు టేబిల్ ముందు కూర్చుని కాఫీ త్రాగుతున్నారు.

"ఒరేయ్ బకుద్దాయిలూ! వెంకటేశం రాలే దేంరా?" పెద్ద గొంతుకతో అరిచాడు పంచాక్షరి.

వెంకటేశం కిస్సురు మనకుండా వెనకాతలేవచ్చి నాలుగో కుర్చీలో కూలబడ్డాడు. యిది పంచాక్షరి చూడలేదు.

"పంచాక్షరీ! నువ్వేమీ బెంగపెట్టుకోక్కర్లే దురా బ్రదర్. నాలుగో బ్రదర్ వచ్చాడు" నవ్వుతూ రమేశం అన్నాడు.

"ఒకే! పంచాక్షరీ మొదలైన మిత్ర బృందమా! నేను గొప్పపని చేశేసాను." నాందీ ప్రస్తావన ఉపన్యాసానికి.

"ఏమిట్రోయ్! త్వరగా చెప్పు. నాకూ వీలయితే నేనూ చేస్తాను." అంటూ ఖాళీ కాఫీ కప్పు టేబిలుమీద పెట్టాడు, గోపాలం.

"గోపాలం! ఆపని నేనుతప్ప మరెవ్వరూ చేయలేరురా! అది నాలాటివాడే చెయ్యాలనుకో!" ప్రగల్భాలు పలికే వెంకటేశం.

"ఏమిట్రా?"

"ప్రేమ-ప్రేమరా! లైలా-మజ్నూలకన్న మించిపోయిన......"

"ఆ!" అని మిగిలినవాళ్లందరూ నోళ్ళకి గ్యారేజ్ తాళంకప్పులకు పని కల్పించారు. తరువాత అందరూ ఒక్కసారిగా తెర్చారు.

"ఎవరినిరోయ్?"—గోపాలం.

"ఎలాగుంటుంది?"—రమేశం.

"ఎలాటి చీర కట్టింది - నాకు తెలుసుకోవాలని ఉంది" —పంచాక్షరి.

"నోరు ముయ్యండి. అలా వర్షపు చినుకులు పడ్డట్లు అడిగేస్తే నేను ఉక్కిరి బిక్కిరైపోయి చావాలి!"

"అయితే చెప్పు" ముగ్గురూ మెల్లిగా అన్నారు.

"మాట్లాడకండి." పెద్ద తనేదో చెప్పేసేటట్టు సర్దుకుంటూ కూర్చున్నాడు గోపాలం.

వెంకటేశం ప్రారంభించాడు:

"ఓడియన్‌లో కాఫీ త్రాగి బస్సుస్టాపుకి వచ్చేనురా! అక్కడే నాప్రక్కన ఒకావిడ-అదే ఒక అబల అనుకోండి, సరిగ్గా పదహారేళ్ళుంటాయి. ఎర్రటి బ్లౌజు, తెల్లటి సిల్కు-చీర, బాటా హైహీల్సు చేతిలో లెదర్ బాగ్, గులాబీవంటి కళ్ళకి నీలిరంగు చలవ కళ్ళజోడు. ఈ ఆకారాన్ని చూచేసరికి నా ఆత్మ ఒక్కసారి అరచినట్లయింది.

నేను ఆమె వైపు చూశాను. ఆమె నా వైపు చూసింది. చూపులు కలిశాయి. ఆమె నావైపుచూసి కనుసైగ చేసింది. అప్పుడు అదేదో సినీమాలో హీరో హీరోయిన్లు "చూపులు కలసిన శుభవేళా! ఎందుకు నీకీ పరవశమూ!" అని పాట ద్యూయట్లు పాడుకున్నారు గదూ-అది జ్ఞాపకం వచ్చింది. నాకు భయమేసింది. స్టాపుదగ్గర చాలమంది వున్నారు. ఓస్! అమ్మాయి పిలుస్తుండగా నేను వెళ్లకపోవడమేమిటి. "ధైర్యే సాహసే ..." అని ఏదో అంటారే అలాగనుకుని ఆమెదగ్గరకు నిర్భయంగా చేరాను,

"మీరెక్కడకు వెడుతున్నారు?" అని ప్రశ్నించింది. నాగుండె 'ఠా' అంది. ధైర్యం తెచ్చుకుని పజ్జన్‌సింగ్' పార్కుకి అని అబద్ధమాడాను.

"నేనూ అక్కడికే" అంది.

"అచ్చే! అక్కడకు వెళ్లనులెండి. టైమయింది. లోడీకాలనీ మార్కెట్టుకి వెళ్లాలి." అన్నాను.

మళ్లీ; "నేనూ అక్కడికే" అంది. ఎలారా బాబూ తప్పించుకోవడం అని ఆలోచించాను ఆ

అమ్మాయిని ప్రేమించి పారేస్తే ఏ గొడవా వుండదని మెల్లగా ఆమెదగ్గరకు జరిగి ఆ చల్లని చేయి పట్టుకుని మాపకాను 'సి' క్వార్టర్‌లోవుంది. కాఫీకిరావాలి! అన్నాను.

"ఆమె నవ్వి మాయింటికికూడా కాఫీకిరావాలి." "తప్పకుండా వస్తా" నన్నాను.

"పేరు సుమిత్రట. ఎంత బాగుందనుకున్నారు. ఈ లోపున బస్సువచ్చింది. కండక్టర్ ఒక్కసీటు వుందన్నాడు ఏంచేస్తాం. ఆమె వెళ్లనంది. యిద్దరంకలసి స్కూటర్ లోడి కాలనీకికుదుర్చుకుని వెళ్లాం‌అక్కడి నుంచి వెళ్లేటపుడు మార్నింగ్ నే కాఫీకి రావాలంది." అని ముగించాడు, వెంకటేశం. ముగించే సమయంలో గోపాలం ముక్కబ్రద్దలయేటట్టు తుమ్మాడు.

"ఈశుభకార్యం ఎలాముగుస్తుందో, గోపీగాడు తుమ్మాడు "నవ్వుతూ పంచాక్షరి అన్నాడు. !

"చాలా అదృష్టవంతుడు" రమేశం అన్నాడు.

♦ ♦ ♦

వెంకటేశం ప్రతీరోజూ 8 గం॥కి లేచేవాడు. ఆ రోజు 6.30 కి అలారం పెట్టుకుని మరీలేచాడు. తన కున్న మంచిబట్టల్లో షార్కుస్కిన్ బుష్‌షర్టు; న్యూషరాక్ ఫ్యాంటుతొడుక్కున్నాడు. ఎప్పుడూ పౌడరురాసుకోనివాడు నిన్నసాయంత్రంవచ్చేటపుడు పాండ్స్‌పౌడరు కొనుకున్నాడు. మీసాలుషార్ట్ చేశాడు. తలపైకిదువ్వాడు. కాళ్లకి బాటాహవా జోళ్లు తొడిగాడు.

మంచి శకునంచూసుకుని బస్టాపుకి వచ్చాడు. బస్సెక్కి Lodi colony లో దిగాడు. 'C' బ్లాకు దగ్గరకువచ్చి '28' నెంబరు రూమ్ Calling Bell Switch నొక్కాడు. ఎవరోవచ్చి తలుపుతీశారు. నిన్న సాయంత్రంకనబడ్డ తన ప్రేయసి కాదు. ఆశ్చర్యపోయాడు. తనస్నేహితుడు. ఎవరోకాదు. కథాగమనమంతా సవివరములతో చెప్పించుకుని విన్న గోపాలం. కొంపదీసి ఈ యిల్లు కాదుగద.

వెంకటేశం అట్లానిలబడిపోవడం గోపాలం చూసి "ఏరా !అలాచూస్తావు ? నేను గోపాలాన్ని లోపలికిరా !" అన్నాడు.

వెంకటేశంతేరుకుని "ఆఁ! ఏం లేదు నీ Zoology Text ఉంటే ఒక షోరియియ్యి" మాటలు మార్చేశాడు.

"ఏం నీదేమయింది."

"రాత్రిరమేశం తీసుకున్నాడు."

"అయితే యిస్తా. కాఫీ తాగేవా ?—అన్నట్టు నిన్న సాయంత్రం ... "

"ఆఁ ! అదే పదిగంటలకు వెడతా"

"సుమిత్రా ! రెండుకాఫీలు పట్టుకురా" అని తన చెల్లెల్ని పిల్చాడు. 'సుమిత్ర' అనే సరికి వెంకటేశానికి ఎందుకోభయంవేసింది. యింతట్లో-

ఎర్రటి బ్లౌజు, తెల్లటి సిల్కుచీర కట్టుకున్న అమ్మాయి ట్రేలోరెండుకాఫీ కప్పులతో వచ్చి అక్కడ కప్పులుపెట్టి వెళ్ళిపోయింది. గోపాలానికి చుట్టాలు కాదుగదా ! వెంకటేశం గుండెల్లోరైళ్లు-విమానాలు పరుగెడుతున్నాయి. సాయంత్రం కనపడ్డ అమ్మాయే.

"అమ్మాయి గురించి ఆలోచిస్తున్నావేమిటోయ్ త్వరగా కాఫీత్రాగి వెడుదువుగాని. ఎదురుచూస్తూ వుంటుంది." అన్నాడు గోపాలం.

ఈ మాటలు వింటున్న వెంకటేశం యాష్ ట్రేలో పడెయ్యవలసిన సిగరెట్టు ముక్క కాఫీకప్పులోముంచేశాడు. గాలుక్కురుచుకున్నాడు. యిదంతాచూస్తున్న గోపాలం నవ్వుకున్నాడు. ఇంకో కాఫీ తెప్పించి యిచ్చాడు. వేడిగా నున్నా గబగబా త్రాగేశాడు.

ఖాళీకప్పులను తీసికెళ్లడానికి అమ్మాయివచ్చింది "మా చెల్లాయిని ఎప్పుడూ చూడలేదు. పుస్తక నెపంతోనయినా వచ్చావు. యిదిగో" అని చెల్లి అని చూపించాడు.

యిద్దరూ ఒకరినొకరు నమస్కరించుకున్నారు. ఒకకంటితో అమ్మాయి తననుచూచినవ్వడంచూశాడు. పళ్ళుపటపట కొరుక్కున్నాడు.

వెంకటేశం యిద్దరికీ 'Good bye' చెప్పి బోనులోనుండి బయటపడ్డపులిలాగ వచ్చేశాడు.

"ప్రేమలంటే యిలాగే వుంటాయికాబోలు" అనుకున్నాడు.

"నా జీవితబ్రతుకింతేనా" అనే రికార్డు ప్రక్కనున్నగ్రామఫోనుల షాపులోనుండి వినబడ్తోంది.

—•••—•••—